సాక్షి
రంగారెడ్డి
మంగళవారం । 5 । నవంబర్ । 2024



పంటలకు గిట్టుబాటు ధర

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. 8లో▸



శ్రమజీవులకు శాపం

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా పదిమందికి గాయాలయ్యాయి. ఈ ఘటన యాచారం ఠాణా పరిధిలో జరిగింది. 8లో▸



లక్ష్య సాధనకు కృషి చేయాలి

విద్యార్థులు క్రమశిక్షణతో లక్ష్యసాధనకు కృషి చేయాలని టీఎస్‌పీఏ డిప్యూటీ డైరెక్టర్, ఐపీఎస్ నర్మద సూచించారు. 8లో▸

న్యూస్‌రీల్

లండన్ పర్యటనకు వెళ్లిన ఎమ్మెల్యే కసిరెడ్డి



విమానాశ్రయంలో ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సోమవారం లండన్ పర్యటనకు బయలుదేరివెళ్లారు. లండన్ వేదికగా ఈనెల 5 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న ప్రపంచ పర్యాటక ప్రదర్శనలో పాల్గొననున్నారు. ఈ పర్యటనకు మంత్రి జూపల్లి కృష్ణారావు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, రాజేశ్‌రెడ్డి, వంశీకృష్ణ తదితరులతో కలిసి వెళ్లారు. ఆయనకు రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు వీడ్కోలు పలికారు.

108లో ఉద్యోగ అవకాశాలు

కందుకూరు: ఈఎంఆర్‌ఐ (108) సంస్థలో ఈఎంటీ ఉద్యోగాల కోసం ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్హతలు ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ, జీఎన్‌ఎం, ఏఎన్‌ఎం బీఎస్సీ (బీజెడ్సీ), బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 30 సంవత్సరాల్లోపు వయస్సు ఉండి జిల్లా పరిధిలో పని చేయాలన్నారు. ఆసక్తి ఉన్న వారు 108 జిల్లా కార్యాలయం, హయత్‌నగర్ ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇతర సమాచారం కోసం 93937 78877 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

షాద్‌నగర్ డీఐ బదిలీ

షాద్‌నగర్‌రూరల్: షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ (డీఐ)గా విధులు నిర్వర్తిస్తున్న పీడీ నాయుడు బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నెల రోజుల క్రితం ఇన్‌చార్జి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించిన ప్రశాంత్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో పీడీ నాయుడు బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత డీఐగా పని చేస్తున్న ఆయన మేడ్చల్ జోన్ సీసీఎస్ విభాగానికి బదిలీ అయ్యారు. సైబరాబాద్ సీపీ కార్యాలయంలో వీఆర్‌లో ఉన్న సంద వెంకటేశ్వర్లును షాద్‌నగర్ డీఐగా బదిలీ చేస్తూ కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. నెల రోజుల వ్యవధిలోనే ఇద్దరు డీఐలు బదిలీ కావడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

కులగణన సదస్సును జయప్రదం చేయండి



మహేశ్వరం: హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించనున్న కులగణన సంప్రదింపుల సదస్సును విజయవంతం చేయాలని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సదస్సుకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరుకానున్నారని, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. సదస్సుకు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై రాహుల్‌గాంధీకి ఘన స్వాగతం పలకాలన్నారు.

నత్తనడకన ఎల్‌ఆర్‌ఎస్

ఆరు నెలలైనా పూర్తికాని ప్రక్రియ

- ఇప్పటి వరకు మున్సిపాలిటీల్లో 7,023, పంచాయతీల్లో ఆరు అర్జీలే పరిశీలన
- వేలల్లో పేరుకుపోయిన దరఖాస్తులు
- దరఖాస్తుదారులకు తప్పని నిరీక్షణ



సాక్షి, రంగారెడ్డిజిల్లా: అనధికారిక లే అవుట్లు, వాటిలోని ఖాళీ స్థలాల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్) ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. కలెక్టర్ ఇప్పటికే సంబంధిత అధికారులతో వరుస సమావేశాలు నిర్వహించి, ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేసినా.. క్షేత్ర స్థాయిలోని టౌన్ ప్లానింగ్, రెవెన్యూ సిబ్బంది మాత్రం పట్టించుకోవడం లేదు. ఖాళీ ప్లాట్లు/ లే అవుట్ల క్రమబద్ధీకరణ కోసం గత ప్రభుత్వం 2020లో నోటిఫికేషన్ జారీ చేసింది. లే అవుట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తుకు రూ.పది వేలు, ఖాళీ ప్లాట్ల క్రమబద్ధీకరణకు రూ.వెయ్యి ఫీజుగా నిర్ణయించింది. ఆ మేరకు హెచ్‌ఎండీఏ పరిధిలోని నాలుగు జోన్లలో 3,58,464 దరఖాస్తులు రాగా, రంగారెడ్డి జిల్లాలోని 13 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్ల పరిధి నుంచి అత్యధికంగా 2,37,259 దరఖాస్తులు అందాయి. 549 గ్రామ పంచాయతీల నుంచి 46,430 దరఖాస్తులు వచ్చాయి. మూడు నెలల్లోనే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందు కోసం రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, ఇరిగేషన్ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. మున్సిపాలిటీల పరిధిలో 46, పంచాయతీల పరిధిలో 18 బృందాలను ఏర్పాటు చేసింది. ఈ బృందాలు ఇప్పటి వరకు మున్సిపాలిటీల్లో 7,023 దరఖాస్తులు క్లియర్ చేయగా, గ్రామ పంచాయతీల్లో కేవలం ఆరు మాత్రమే క్లియర్ చేసినట్లు సమాచారం. మిగిలిన దరఖాస్తులన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి.

అధికారులకు సవాల్

ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపానికి తోడు.. క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఆరు నెలలైనా ప్రక్రియ ఇప్పటికీ పూర్తి కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇంటి నిర్మాణ అనుమతులు, బ్యాంకు లోన్ల కోసం వెళ్లాలని భావించే దరఖాస్తుదారులకు నిరాశే మిగులుతోంది. విధిలేని పరిస్థితుల్లో కొంత మంది టౌన్‌ప్లానింగ్ అధికారులు అడిగినంత ముట్టజెప్పి.. తమ దరఖాస్తులను క్లియర్ చేయించుకుంటుండగా, ఇచ్చేందుకు నిరాకరించిన వారికి మరింత కాలం నిరీక్షణ తప్పడం లేదు. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన కోసం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ రూపొందించిన పోర్టల్ సర్వర్ తరచూ మొరాయిస్తుండటం.. క్షేత్రస్థాయి సిబ్బంది పోర్టల్‌లో లాగిన్రై.. అన్ని వివరాలను నమోదు చేసి, తీరా సబ్మిట్ బటన్ నొక్కితే.. ఫీజు చెల్లింపులు, రసీదులు, ప్రొసీడింగ్‌ల జారీ వంటి ప్రక్రియ పూర్తికాక పోగా మళ్లీ మొదటికొస్తుండటంతో ఏం చేయాలో అర్థంకాక ఆయా బృందాలు తల పట్టుకుంటున్నాయి. ఇప్పటికే అక్రమ నిర్మాణాల గుర్తింపు, కూల్చివేతలు, కొత్త భవనాలకు అనుమతుల జారీ, ఇంటి పన్ను నిర్ధారణ, వసూళ్లు వంటి ప్రక్రియతో బిజీగా ఉన్న టౌన్‌ప్లానింగ్ అధికారులకు వేలల్లో పేరుకుపోయిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన సవాల్‌గా మారింది.

వాటి ఆమోదం కోసం ఒత్తిడి

ఆదిబట్ల మున్సిపాలిటీలో 14,892, ఆమనగల్లు 3,561, ఇబ్రహీంపట్నం 15,345, జల్‌పల్లి 10,892, కొత్తూరు 3,956, మణికొండ 2,591, నార్సింగి 3,354, పెద్ద అంబర్‌పేట్ 43,459, షాద్‌నగర్ 15,466, శంషాబాద్ 96,791, శంకర్‌పల్లి 4,720, తుక్కుగూడ 2,541, తుర్కయంజాల్ 49,686, బడంగ్‌పేట్ 47,790, బండ్లగూడ జాగీర్ 7,753, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 3,412 అర్జీలు అందాయి. అదే విధంగా ఫరూఖ్‌నగర్ మండలంలో 22,051, కేశంపేట 10,200, తలకొండపల్లి 2,323, యాచారం 4,464, కడ్తాల్ 3,513, కొందుర్గు 1,505, ఆమనగల్లు మండలంలో 929, మాడ్గుల 708, జిల్లెడు చౌదరిగూడెం 683, మంచాల నుంచి 54 వినతులు అందాయి. వచ్చిన దరఖాస్తుల్లో 35,837 నిషేధిత జాబితాలో ఉన్నట్లు తెలిసింది. వీటి ఆమోదం కోసం రాజకీయ నేతల నుంచి ఒత్తిళ్లు మొదలైనట్లు సమాచారం.



అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, ఇతర అధికారులు

దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టొద్దు

అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టొద్దని అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 43, ఇతర శాఖలకు సంబంధించి 7 మొత్తం 50 దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అన్నారు. ఫిర్యాదుదారులకు సత్వరమే న్యాయం జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా, మున్సిపల్, మండల, కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.

ఆ అధికారులపై చర్యలు తీసుకోండి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ భూములను అటవీ అధికారులు కబ్జా చేస్తున్నారని పోల్కంపల్లి గ్రామ రైతులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి సర్వే నంబర్ 291లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులు 60 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నట్టు తెలిపారు. ఇటీవల ఫారెస్టు అధికారులు వచ్చి 50 ఎకరాలకు పైగా కబ్జా చేసి చుట్టూ ప్రహరీ వేయడానికి చూస్తున్నారని మండిపడ్డారు. అటవీ శాఖ అధికారులకు ఆ భూములపై ఎలాంటి హక్కులు లేకున్నా రైతులను బెదిరిస్తున్నారని వాపోయారు. అటవీశాఖ గెజిట్‌లో ఎకరం భూమి కూడా లేదన్నారు. ఎలాంటి సర్వే చేయకుండా పేద దళిత రైతుల భూములు ఆక్రమించాలని చూస్తున్న అటవీ శాఖ అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైతులు చెరుకూరి రవీందర్, పి.యాదయ్య, కంభాలపల్లి ధన్‌రాజ్, నర్సింహ ముదిరాజ్, కావలి ఎల్లయ్య, సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

భూములు బలవంతంగా తీసుకోవద్దు



అధికారికి వినతిపత్రం అందిస్తున్న రైతులు

కందుకూరు: ఫోర్త్ సిటీ వరకు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం తమ భూములను బలవంతంగా సేకరించడానికి సమాయత్తం అయిందని.. తమకు న్యాయం చేయాలంటూ భూములు కోల్పోతున్న రైతులు సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. తమ తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూములను ఎలాంటి గ్రామ సభలు పెట్టకుండా, తమ నిర్ణయాన్ని తెలుసుకోకుండా తమ అనుమతులు తీసుకోకుండా సేకరిస్తున్నట్లు బహిరంగ ప్రకటన చేశారన్నారు. తాము జీవనాధారం కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ప్రభుత్వం కొత్తూరు గేట్ నుంచి కందుకూరు మీదుగా మీర్‌ఖాన్‌పేట వరకు ఫార్మాసిటీ కోసం 200 అడుగుల రహదారిని నిర్మించిందన్నారు. ప్రస్తుతం ఆ రహదారి అందుబాటులో ఉందన్నారు. దాన్ని వదిలేసి కొత్తగా ఓఆర్ఆర్ నుంచి తిమ్మాపూర్, లేమూరు, రాచులూరు మీదుగా గతంలో నిర్మించిన ఫార్మా రహదారి వరకు 300 అడుగుల విస్తీర్ణం మేర రహదారిని నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారన్నారు. తమ భూములు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు డి.సుధాకర్‌రెడ్డి, నీరటి శ్రీకాంత్, జంగారెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే సమాజంలో గుర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న సబితారెడ్డి

మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

కడ్తాల్: సేవలతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తాయని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ 4వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేడుకలకు సబితారెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, గిడ్డంగుల సంస్థ మాజీ చైర్‌పర్సన్ రజిని సాయిచంద్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సబితారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం కలిగి ఉండాలని ఆకాంక్షించారు. కష్టాల్లో ఉన్న పేదల కోసం రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, పలువురు నాయకులు మాట్లాడుతూ.. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఆపదలో ఉన్న పేద ప్రజలను ఆదుకోవడం అభినందనీయమని ట్రస్ట్ చైర్మన్ దశరథ్ నాయక్‌ను ప్రశంసించారు. ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్ మాట్లాడుతూ.. ట్రస్ట్ ద్వారా నాలుగేళ్లుగా పేద ప్రజలకు సేవలందిస్తున్నట్టు చెప్పారు. ఈ ఏడాది నుంచి తల్లిదండ్రులు లేని అనాథ పిల్లల పెళ్లిళ్లకు తులం బంగారం, రూ.1,10,116 నగదు అందించనున్నట్టు ప్రకటించారు. అనంతరం ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన 60 మంది బాధిత కుటుంబాలకు ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.3 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, పట్టణ అధ్యక్షుడు కడారి రామకృష్ణ, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ విజయ్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

డిసెంబర్ 19 నుంచి హైదరాబాద్ బుక్ ఫెయిర్

పంజగుట్ట: కంప్యూటర్లు వచ్చినా, ఈ బుక్స్, ఆన్‌లైన్ పరిధి ఎంత పెరిగినా పుస్తకం పేజీల వాసన చూసుకుంటూ చదివే వారి సంఖ్య కూడా పెరుగుతూనే ఉందని ఎమ్మెల్సీ, హైదరాబాద్ బుక్‌ఫెయిర్ సొసైటీ సలహాదారు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం 37వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ పోస్టర్‌ను ఫెయిర్ సలహాదారు రామచంద్రమూర్తి, ఆచార్య రమా మెల్కోటె, ఫెయిర్ అధ్యక్షుడు యాకూబ్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డిసెంబర్ 19 నుంచి 29 వరకు ఎన్‌టీఆర్ స్టేడియం గ్రౌండ్స్, కళాభారతిలో బుక్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 12 నుంచి రాత్రి 9 గంటలవరకు కొనసాగుతుందన్నారు.

సార్లు లేరు.. భోజనం సరిగా లేదు

- 'కోడింగ్' విద్యార్థుల ఆందోళన
- ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- మద్దతు పలికిన తల్లిదండ్రులు
- పోలీసుల జోక్యంతో ఆందోళన విరమణ



కోడింగ్ పాఠశాలలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

మొయినాబాద్: తగినంత మంది ఉపాధ్యాయులు లేరు.. భోజనం సరిగా పెట్టడంలేదంటూ కోడింగ్ పాఠశాల విద్యార్థులు ఆందోళనకు దిగారు. మండల పరిధిలోని పెద్దమంగళారం రెవెన్యూలో ఉన్న ఆజాద్ కళాశాల భవనంలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల ఆధ్వర్యంలో కోడింగ్ పాఠశాల నిర్వహిస్తున్నారు. మూడేళ్లుగా నడుస్తున్న ఈ పాఠశాలలో రెండు నెలల క్రితం ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. వారి స్థానంలో కొత్తవారు రాకపోవడంతో శంకర్‌పల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నుంచి 8 మందిని ఐదు రోజుల క్రితం పంపించారు. ఉపాధ్యాయులతోపాటు శంకర్‌పల్లి గురుకులంలో చదివే 5, 6, 7వ తరగతి విద్యార్థులు 240 మందిని కోడింగ్ పాఠశాలకు పంపించారు. అప్పటికే ఈ పాఠశాలలో 220 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థుల సంఖ్య పెరగడంతో సమస్యలు మొదలయ్యాయి.

ప్లకార్డులు.. నినాదాలు

శంకర్‌పల్లి గురుకుల పాఠశాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు తమకు సరిగా విద్యాబోధన చేయడం లేదని కోడింగ్ విద్యార్థులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆందోళనకు దిగారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. విద్యార్థులు ఎక్కువ మంది కావడంతో భోజనం కూడా సరిగా పెట్టడంలేదని.. కోడింగ్ పాఠశాలకు ప్రవేశ పరీక్షలో పాసై వచ్చిన తమను పక్కనపెట్టి శంకర్‌పల్లి గురుకులం విద్యార్థులకు కోడింగ్ నేర్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోడింగ్ పాఠశాలను వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని.. రాష్ట్రంలోని అన్ని గురుకులాల నుంచి కోడింగ్ పాఠశాలకు 5వ తరగతి నుంచి విద్యార్థులను తీసుకోవాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం అక్కడికి చేరుకుని వారికి మద్దతు తెలిపారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని.. సరైన ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలని.. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాఠశాల ఇన్‌చార్జి సౌభాగ్యవతితో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

రిజిస్ట్రేషన్ చేయాలి



మొయినాబాద్‌లో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థ నిర్వహిస్తున్న కోడింగ్ పాఠశాలను ముందుగా రిజిస్ట్రేషన్ చేయాలి. రిజిస్ట్రేషన్ లేకపోతే మాకు గుర్తింపు ఉండదు. కోడింగ్ పాఠశాలలో చేరాలంటే ప్రవేశ పరీక్ష రాయాలి. శంకర్‌పల్లి గురుకుల పాఠశాల విద్యార్థులకు ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండా ఇక్కడికి తీసుకొచ్చి కోడింగ్ నేర్పిస్తున్నారు.

– వాసవి, విద్యార్థిని

ఉపాధ్యాయులు లేరు



మొయినాబాద్ కోడింగ్ పాఠశాలలో సుమారు 220 మంది విద్యార్థులు ఉండగా ఇటీవల అదనంగా శంకర్‌పల్లి గురుకులం నుంచి 240 మంది విద్యార్థులను ఇక్కడికి తీసుకొచ్చారు. ఇక్కడ ఉన్న ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. తగినంత మంది ఉపాధ్యాయులు లేరు. ప్రస్తుతం విద్యార్థులు పెరగడంతో భోజనం సరిగా పెట్టడం లేదు.

– ఎలిజిబెత్, విద్యార్థిని

సమస్యలన్నీ పరిష్కరిస్తాం



ఇటీవల టీచర్ల బదిలీలు జరగడంతో ఇక్కడున్నవారంతా బదిలీ అయ్యారు. కోడింగ్ నేర్పించే వారు మాత్రం ఉన్నారు. సబ్జెక్టులకు సంబంధించి పూర్తి స్థాయిలో లేరు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. విద్యార్థులు పెరగడంతో భోజనం విషయంలో కొంత ఇబ్బంది ఏర్పడింది. అదనంగా వంట మనుషులను ఏర్పాటు చేయించాం. అన్ని సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తాం.

– సౌభాగ్యవతి, పాఠశాల ఇన్‌చార్జి

బాస్కెట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్ల హవా

బాలబాలికల విభాగంలో ప్రథమ స్థానం



ప్రథమస్థానంలో నిలిచిన జిల్లా జట్లకు బహుమతులు అందజేస్తున్న అడిషనల్ ఎస్పీ చెన్నయ్య



కేసముద్రం: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ (అండర్ -17 విభాగం బాలబాలికలు) పోటీలు సోమవారంతో ముగిశాయి. బాలికల సెమీఫైనల్‌లో ఖమ్మంపై (15) రంగారెడ్డి (23) విజయం సాధించగా, నిజామాబాద్‌పై (22) హైదరాబాద్ (25) గెలిచింది. ఫైనల్‌లో హైదరాబాద్‌పై (05) రంగారెడ్డి (19) విజయం సాధించి ప్రథనస్థానాన్ని కైవసం చేసుకుంది. ద్వితీయస్థానంలో హైదరాబాద్ నిలిచింది. బాలుర సెమీఫైనల్‌లో ఖమ్మంపై (21) రంగారెడ్డి (35) విజయం సాధించగా, నిజామాబాద్‌పై (21) హైదరాబాద్ (23) విజయం సాధించింది. ఫైనల్‌లో హైదరాబాద్‌పై (08) రంగారెడ్డి (18) విజయం సాధించి ప్రథమస్థానాన్ని కైవసం చేసుకుంది. ద్వితీయ స్థానంలో హైదరాబాద్ నిలిచింది. తృతీయస్థానాల్లో నిజామాబాద్ జిల్లా బాలబాలికల జట్లు, ఖమ్మం జిల్లా బాలబాలికల జట్లు నిలిచాయి. మహబూబాబాద్ అడిషనల్ ఎస్పీ చెన్నయ్య విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ లక్ష్యం ఎంచుకుని ముందుకు సాగాలని, అప్పుడే వారికి భవిష్యత్ ఉంటుందన్నారు. క్రీడలతోపాటు, చదువులో రాణిస్తే ఉన్నతస్థాయికి ఎదుగుతారన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర


పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభించి ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

రైతు సంక్షేమమే ప్రధానం

- ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం ఆయన చిల కమ్మర్రి గ్రామం రాఘవేంద్ర కాటన్ కార్పొరేషన్ ఆవరణలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే పత్తి విక్రయించాలని.. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. తేమ శాతంపై అధికారులు రైతులకు సరైన అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, చల్లా శ్రీకాంత్ రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, పురుషోత్తంరెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హాక్-2024 పోస్టర్ ఆవిష్కరణ

రేపు ది పార్క్ హోటల్‌లో సదస్సు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీఎస్సీ), నగర పోలీసు విభాగం సంయుక్తంగా నిర్వహిస్తున్న సైబర్ సెక్యూరిటీ వార్షిక సమ్మిట్ (హాక్)–2024 పోస్టర్‌ను నగర కొత్వాల్ సీవీ ఆనంద్ సోమవారం ఆవిష్కరించారు. బుధవారం జరుగనున్న ఈ సదస్సుకు సోమాజిగూడలోని ది పార్క్ హోటల్ వేదిక కానుంది. ఇందులో వివిధ పరిశ్రమ నిపుణులు, ప్రభుత్వ అధికారులతో పాటు మేధావులు, నేతలు సైతం పాల్గొనున్నారు. సైబర్ భద్రత అనేది పోలీసుల ఒక్కరి బాధ్యత మాత్రమే కాదన్న ఆనంద్.. ఈ శిఖరాగ్ర సమావేశం ద్వారా ప్రతి పౌరుడు డిజిటల్ భద్రతకు సంరక్షకుడిగా మారడానికి దోహదపడుతుందన్నారు. ఈ సదస్సులో సైబర్ భద్రతలో ఏఐ పాత్రపై ప్యానెల్ చర్చ, డిజిటల్ భద్రతపై ప్రముఖులు, నాయకులతో చర్చలు, సైబర్ సెక్యూరిటీ సాధనాల ప్రదర్శనలు, సైబర్ సెక్యూరిటీ నిపుణులు, ఆ పరిశ్రమల ప్రముఖులు, ప్రభుత్వ అధికారులతో నెట్‌వర్కింగ్ అవకాశాలపై చర్చలు ఉంటాయని ఆనంద్ వివరించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు హాజరుకానున్నట్లు తెలిపారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నగర కొత్వాల్ సీవీ ఆనంద్

మహిళ మెడలోంచి పుస్తెలతాడు చోరీ

షాద్‌నగర్‌రూరల్: బస్సు ఎక్కుతున్న మహిళ మెడలోంచి గుర్తు తెలియని దుండగులు బంగారం దొంగిలించారు. ఈ సంఘటన సోమవారం చోటు చేసుకుంది. డిటెక్టివ్ సబ్ ఇన్‌స్పెక్టర్ శరత్‌కుమార్ తెలిపిన ప్రకారం కొత్తూరు గ్రామానికి చెందిన అరుంధతి పరిగి వెళ్లేందుకు కొత్తూరులోని బస్టాండ్‌కు వచ్చింది. షాద్‌నగర్ వెళ్లేందుకు బస్సు ఎక్కే సమయంలో రద్దీ ఎక్కువగా ఉండటంతో గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలోంచి రెండు తులాల బంగారు పుస్తెల తాడు(బంగారు గొలుసు)ను దొంగిలించారు. కొత్తూరు నుంచి షాద్‌నగర్ బస్టాండ్‌కు వచ్చి పరిగి వెళ్లేందుకు బస్సు కోసం వేచి ఉంది. ఆ సమయంలో తన మెడలో పుస్తెలతాడు లేకపోవడంతో ఆమె నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు షాద్‌నగర్ బస్ డిపో, కొత్తూరు బస్టాండ్‌వద్ద సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

అశ్లీల నృత్యాలపై కేసు

పహాడీషరీఫ్: హిజ్రాలతో కలిసి వివాహ శుభకార్యంలో స్థానికులకు ఇబ్బంది కలిగించిన ఘటనపై బాలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. షాహీన్‌నగర్ అలీనగర్ ప్రాంతానికి చెందిన అమేర్ కుమారుడి వివాహ నిశ్చితార్థానికి సంబంధించి ఇంటి వద్ద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యం వద్దకు కొందరు హిజ్రాలు డబ్బులు వసూలు చేసేందుకు రావడంతో అమేర్ నృత్యాలు చేయండని వారికి సూచించి సౌండ్ బాక్స్‌లను ఏర్పాటు చేశాడు. ఇదే ఆనందంలో వారితో కలిసి పెద్ద ఎత్తున సౌండ్ పెంచుతూ నృత్యాలు చేస్తూ స్థానికులకు ఇబ్బంది కలిగించాడు. ఈ ఘటనపై స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ముజ్రా పార్టీ అంటూ సోషల్ మీడియాల్లో వస్తున్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపారు.

అతివేగం.. శ్రమజీవులకు శాపం

అతివేగం శ్రమజీవుల పాలిట శాపమైంది. రోజంతా చెమటోడ్చి గూటికి చేరుతున్న సమయంలో కారు రూపంలో కష్టజీవులకు కన్నీళ్లు మిగిల్చింది. ప్రమాదంలో గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిస్తుండగా ఒకరు మృతి చెందగా, తొమ్మిది మంది చికిత్స పొందుతున్నారు.

ఆటోను ఢీకొట్టిన కారు

- పత్తి తీత కూలీలకు తీవ్ర గాయాలు, ఒకరి మృతి
- క్షతగాత్రులంతా నందివనపర్తి గ్రామస్తులు

యాచారం: వేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి ముందు వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. తేరుకున్న కారు డ్రైవర్ తప్పించుకునే యత్నంలో మరో బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, తొమ్మిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన యాచారం ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నందివనపర్తి గ్రామానికి చెందిన బుచ్చమ్మ, బాలమణి, యాదమ్మ, సుగుణమ్మ, రాములమ్మ, అండాలు, లక్ష్మమ్మ, పెంటమ్మలు గ్రామానికి చెందిన ఈశ్వరయ్య ఆటోలో నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం తీగ మల్లెపల్లి గ్రామంలో పత్తి తీతకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో సోమవారం రాత్రి 7:30 గంటలకు యాచారం పోలీస్ స్టేషన్ సమీపంలోని డీఎస్ఆర్ ఫంక్షన్ హాల్ ముందు మాల్ నుంచి హైదరాబాద్‌కు వేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి కూలీలు ప్రయాణిస్తున్న ఆటోను బలంగా ఢీకొట్టింది. దీంతో కారు డ్రైవర్ తప్పించుకునే యత్నంలో ఆటోను ముందు వెళ్తున్న మరో బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో పాటు 8 మంది కూలీలు, బైక్ నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మాల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అందులో పరిస్థితి విషమంగా బుచ్చమ్మను నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.


ప్రమాదానికి కారణమైన కారు

లక్ష్య సాధనకు కృషి చేయాలి

- టీఎస్‌పీఏ డిప్యూటీ డైరెక్టర్, ఐపీఎస్ అధికారి నర్మద
- జిల్లా స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

మొయినాబాద్ రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో లక్ష్యాసాధనకు కృషి చేయాలని తెలంగాణ పోలీస్ శిక్షణ అకాడమీ(టీఎస్‌పీఏ) డిప్యూటీ డైరెక్టర్, ఐపీఎస్ నర్మద సూచించారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ సమీపంలో గండిపేట కుటీరంలో ఎన్టీఆర్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్‌లో మూడు రోజులపాటు స్పోర్ట్స్‌మీట్, కల్చర్ ఫెస్ట్ నిర్వహించనున్నారు. తొలిరోజు సోమవారం ప్రారంభోత్సవానికి ఐపీఎస్ నర్మద, మ్యూజిక్ డైరెక్టర్ సురేశ్ మాధవపెద్ది సురేశ్, గిన్నిస్ బుక్ వార్ల్డ్ లార్జ్ ట్రైనర్ ప్రతిభ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐపీఎస్ నర్మద మాట్లాడుతూ.. గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. అనంతరం ప్రతిభ మాట్లాడుతూ.. మహిళలు ఒకరి సాయం కోరద్దని పోరాడితే సాధించలేనిది ఏదీ లేదన్నారు. పాఠశాల డీన్ డాక్టర్ రామారావు మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు నిర్వహించనున్న పోటీల్లో జిల్లాలోని 22 పాఠశాలల నుంచి వేయి మందికి పైగా విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్టిఆర్ విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ జోజిరెడ్డి, కె.శ్రీనివాసులు, ఏఓ సురేష్, మట్టయ్య, రిజిస్ట్రేషన్ ఉపాధ్యాయురాలు శ్రీదేవి, అధ్యాపకురాలు, విద్యార్థులు పాల్గొన్నారు.


బెలూన్లను వదిలి క్రీడోత్సవాలను ప్రారంభిస్తున్న టీఎస్‌పీఏ డిప్యూటీ డైరెక్టర్ నర్మద

ఎయిర్‌పోర్టులో హర్షసాయి ప్రత్యక్షం

శంషాబాద్ రూరల్: కొంతకాలంగా విదేశాల్లో ఉన్న యూట్యూబర్ హర్షసాయి సోమవారం శంషాబాద్ విమానాశ్రయంలో ప్రత్యక్షమయ్యాడు. ఎయిర్‌పోర్టులో మీడియాతో మాట్లాడారు. ఒక చిన్న పని ఉండటంతో విదేశానికి వెళ్లి పని పూర్తి చేసుకుని తిరిగి వచ్చినట్లు తెలిపారు. తనపై వచ్చిన ఆరోపణలు నిజం కావని కోర్టు నమ్మి బెయిల్ ఇచ్చిందన్నారు. తాను రాసి తీసిన సినిమాకు వాళ్లే కాపీరైట్స్ అడిగారని పేర్కొన్నారు. తాను ఎక్కడ ఎవరినీ డబ్బులు డిమాండ్ చేయలేదన్నారు. ప్రజల్లో తనను చులకన చేయడానికి కొందరు అసత్య ప్రచారాలు చేసినట్లు తెలిపారు. పోలీసుల విచారణలో నిజానిజాలు బయటకు రావడంతో కోర్టు బెయిల్ ఇచ్చిందన్నారు. త్వరలో సినిమాను రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు.

పోల్‌ను ఢీకొట్టి పల్టీ కొట్టిన కారు


కారుపై పడిపోయిన స్తంభం

రాజేంద్రనగర్: వేగంగా దూసుకొచ్చిన ఓ కారు పీవీ నర్సింహారావు ఫ్లైఓవర్ ఉప్పర్‌పల్లి సమీపంలో ఉన్న ఎలక్ట్రిక్ పోల్‌ను ఢీకొట్టి పల్టీ కొట్టింది. ఈ సంఘటన సోమవారం పీవీ నర్సింహారావు ఫ్లైఓవర్‌పై చోటుచేసుకుంది. దీంతో ఈ సంఘటనతో ఫ్లైఓవర్ రెండు వైపుల పెద్ద ఎత్తున ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఈ సంఘటనలో హైదరాబాద్ నుంచి ఆరాంఘర్ వైపు వస్తుండగా వాహనాన్ని కంట్రోల్ చేసుకోలేక ఎలక్ట్రికల్ పోల్‌ను ఢీకొట్టడంతో డ్రైవర్ స్వల్ప గాయాలకు గురయ్యాడు. దీంతో రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.

నాలెడ్జ్ సిటీలో బైక్ రేస్

53 బైక్‌లు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌లోని నాలెడ్జ్ సిటీలోని టీ-హబ్ సమీపంలో బైక్ రేస్‌ల పరంపర కొనసాగుతోంది. కేసులు నమోదు చేస్తున్నా పట్టించుకోకుండా యువకులు బైక్‌పై ప్రమాదకర స్థాయిలో స్టంట్‌లు చేయడం ఆందోళన కల్గిస్తోంది. శనివారం రాత్రి బైక్‌పై స్టంట్‌లు చేస్తున్నట్లు సమాచారం అందడంతో రాయదుర్గం పోలీసులు టీ-హబ్ పరిసరాలను దిగ్బంధం చేశారు. పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు 53 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వారిపై బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 125 ప్రకారం కేసులు నమోదు చేశారు. గత మూడు రోజులుగా 89 బైక్‌లను స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితులను కోర్టులో హాజరుపరిచారు. ఇప్పటి వరకు 203 బైక్‌లు, మూడు కార్లను స్వాధీనం చేసుకున్నట్లు మాదాపూర్ డీసీపీ వినీత్ తెలిపారు.

జల్సాలకు అలవాటుపడి బైక్ చోరీలు

నిందితుడి అరెస్ట్

- నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం

షాద్‌నగర్‌రూరల్: జల్సాలకు అలవాటు పడిన ఓ యువకుడు బైక్ చోరీలకు పాల్పడుతున్నాడు. ద్విచక్రవాహనాలు దొంగిలిస్తున్న నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. పట్టణ సీఐ విజయ్‌కుమార్ సోమవారం కేసు వివరాలు వెల్లడించారు. నందిగామ మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన వంశీ పెయింటర్‌గా పని చేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడిన ఆ యువకుడు సులభంగా డబ్బు సంపాదించేందుకు బైక్ చోరీలకు పాల్పడుతున్నారు. వైన్స్ , కిరాణా షాపులు, ఇంటివద్ద, బస్టాండ్, రైల్వే స్టేషన్ వద్ద పెట్టిన ద్విచక్ర వాహనాలను దొంగతనాలకు చేస్తున్నాడు. ఈ నెల 2న శంషాబాద్ మండలం మలశ్కాపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి తన బైక్‌ను పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో నిలిపాడు. తిరిగి వచ్చేవరకు బైక్ కనిపించలేదు. దీంతో బాధితుడు ఈ నెల 3న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో వంశీని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. దీంతో అతని వద్ద నుంచి నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో డిటెక్టివ్ సబ్ ఇన్‌స్పెక్టర్ శరత్‌కుమార్, కానిస్టేబుళ్లు మోహన్, కర్ణాకర్, జాకీర్, రాజు, రఫీ పాల్గొన్నారు.


షాద్‌నగర్‌రూరల్: స్వాధీనం చేసుకున్న బైక్‌లు, చిత్రంలో నిందితుడు వంశీ

ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలో ఇద్దరికి రిమాండ్

ఇబ్రహీంపట్నం: బైక్ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. సోమవారం సీఐ ఆంజనేయులు తెలిపిన ప్రకారం.. మాడ్గుల మండలం బోయినపల్లి గ్రామానికి చెందిన మూల అజేందర్, ఖమ్మం జిల్లా ఇల్లెందు పరిధిలో భాగ్యనగర్ తండాకు చెందిన గుగులోతు అంజి తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి రాజీవ్‌గృహకల్పలో నివాసం ఉంటున్నారు. వీరిద్దరూ జల్సాలకు అలవాటు పడి బైక్ చోరీలకు పాల్పడుతున్నారు. ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఎస్ఐ చందర్‌సింగ్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా వీరు వస్తున్న పల్సర్ బైక్‌ను ఆపారు. ధ్రువపత్రాలు అడగడంతో అక్కడనుంచి చాకచక్యంగా తప్పించుకున్నారు. దీంతో పోలీసులు వారిని వెంబడించి స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించగా వారు చేసిన చోరీల చిట్టా బయటపెట్టారు. ఆదిబట్ల పీఎస్ పరిధిలో ఓ పల్సర్, మీర్‌పేట పీఎస్ పరిధిలో పల్సర్, యాక్టివా, వనస్థలిపురం పీఎస్ పరిధిలో ఒక యాక్టివా, ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలో చోరీ చేసిన పల్సర్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.


ఇబ్రహీంపట్నం: స్వాధీనం చేసుకున్న బైక్‌లు, నిందితులతో సీఐ సత్యనారాయణ

అయ్యో అజయ్!

- పాఠశాలలో గేటు మీదపడి ఆరేళ్ల బాలుడి దుర్మరణం
- హయత్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఘటన

లింగోజిగూడ: పాఠశాల ముగియడంతో ఆడుతూ పాడుతూ ఇంటికి వెళ్దామని బయలుదేరిన ఓ చిన్నారిని..ఆ పాఠశాల గేటు కబళించింది. ఇనుప గేటు మీద పడడంతో ఆ చిన్నారి తీవ్రంగా గాయపడి మృత్యువాత పడ్డాడు. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్ ముదిరాజ్ కాలనీలో నివాసం ఉండే అలకంటి చందు కుమారుడు అజయ్ (6) హయత్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి చదువుతున్నాడు. సోమవారం పాఠశాల ముగిసిన అనంతరం సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటికి వెళ్లే ముందు..సరదాగా ఉన్నత పాఠశాల ప్రధాన గేటు ఎక్కి స్నేహితులతో కలిసి ఆడుకుంటుండగా ఒక్కసారిగా గేటు విరిగి అజయ్‌పై పడింది. దీంతో అజయ్ తలకు తీవ్రగాయాలు కావడంతో వెంటనే పలు ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించారు. అయినా ఫలితం లేకపోవడంతో చివరకు వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అజయ్ సాయంత్రం ఐదున్నర గంటల ప్రాంతంలో మృతి చెందాడు. అజయ్ తండ్రి చందు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అజయ్‌ను మొదట ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారని, అక్కడ ప్రాథమిక వైద్యం అందించి ఉంటే బతికి ఉండే వాడని, ప్రైవేట్ ఆసుపత్రుల్లో నిర్లక్ష్యం వహించారని పలువురు ఆరోపిస్తున్నారు.


అజయ్ మృతదేహం

స్తంభించిన మెట్రో సేవలు

సాంకేతిక సమస్యలతో నిలిచిన సర్వీసులు

- నాగోల్-రాయదుర్గం మధ్య రాకపోకలకు అంతరాయం
- తీవ్ర ఇబ్బందులకు గురైన ప్రయాణికులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో సోమవారం పలు మెట్రో సర్వీసులు స్తంభించాయి. అనూహ్యంగా తలెత్తిన సాంకేతిక సమస్యల వల్ల ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 11 గంటల మధ్య నాగోల్-రాయదుర్గం రూట్‌లో క్లాంప్స్ ట్రిప్ కావడంతో మెట్రో సర్వీసులు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ రూట్‌లో నెలకొన్న సాంకేతిక సమస్య ప్రభావం వల్ల ఎల్‌బీనగర్-మియాపూర్ కారిడార్‌లోనూ రైళ్లు ఆలస్యంగా నడిచాయి. ఇటు ఎల్‌బీనగర్ నుంచి అటు నాగోల్ నుంచి అమీర్‌పేట్‌కు చేరుకొనేందుకు ప్రయాణికులు పడిగాపులు కాయవలసి వచ్చింది. ఉదయం ఆఫీసులకు వెళ్లవలసిన ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ నిపుణులు, వివిధ రంగాల్లో పనిచేసే ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు అమీర్‌పేట్, బేగంపేట్, రాయదుర్గం, హైటెక్‌సిటీ, తదితర స్టేషన్‌లలో చిక్కుకుపోయారు. విద్యార్థులు కూడా సకాలంలో స్కూళ్లు, కాలేజీలకు వెళ్లలేకపోయారు. 11 గంటల సమయంలో క్లాంప్స్‌ను పునరుద్ధరించారు. అనంతరం మూడు కారిడార్‌లలో మెట్రో సేవలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. మరోవైపు తరచుగా ఇలా ఎక్కడో సాంకేతిక సమస్యలు తలెత్తి రైళ్లు నిలిచిపోవడం పట్ల ప్రయాణికులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇలా ఉండగా, కేవలం 15 నిమిషాల్లో సాంకేతిక సమస్యలను పరిష్కరించి రైళ్లను పునరుద్ధరించినట్లు మెట్రో అధికారులు తెలిపారు.

